డిఎస్‌పిని సన్మానించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి డిఎస్‌పి కొండయ్య నాయుడుని టిడిపి రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ కొండయ్య నాయుడు ఎంతో సమర్ధవంతమైన అధికారి అని తెలిపారు. అలాంటి వ్యక్తి మదనపల్లెకి రావడం శుభసూచకమన్నారు. ఆయన ఆధ్వర్యంలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ జరుగుతుందన్నారు. ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే సత్ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో సోమశేఖర్, బేరి శ్రీనివాసులు, జయరాం రెడ్డి, రవీంద్ర, శ్రీనివాసులు రెడ్డి మరియు జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


డిఎస్‌పిని సన్మానిస్తున్న సురేంద్ర యాదవ్

తగ్గిన పసుపు సాగు



పెరుగుతున్న పెట్టుబడి
మద్దతు ధరలు లేకపోవడం ప్రధాన కారణం

ప్రజాశక్తి -చాపాడు

దేశంలోని ముఖ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల్లో పసుపు ఒకటి. దేశీయ వినియోగంతో పాటు కొన్ని వేల టన్నులను విదేశాలకు ప్రతి సంవత్సరం ఎగుమతి చేయడం, మందుల తయారీలో, రంగులలో, సౌందర్య సాధనాలలోఅధికంగా ఉపయోగిస్తారు. భారతీయ సంస్కృతిలో పసుపునకు మంచి స్థానం ఉంది. ప్రతి కార్యక్రమంలో పసుపును తప్పక వాడతారు. పసుపు సాగులో భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. పసుపు ఉత్పత్తిలో 80 శాతం వరకు మన దేశానిదే. దేశీయ ఉత్పత్తిలో 40 శాతం వాటా మన ఆంధ్రప్రదేశ్‌ది. మన రాష్ట్రంలో గతంలో సుమారు 16 800 హెక్టార్లలో పసుపు సాగు చేస్తూ 1, 46000 మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించేవారు. అది కూడా కడప, గుంటూరు జిల్లాలో ముఖ్యంగా పసుపు సాగు చేసేవారు.

గతంలో కడప జిల్లాలో సాగు..

కడప జిల్లాలోని 21 మండలాల్లో 12,500 ఎకరాల్లో రైతులు సాగు చేసేవారు. రెండేళ్ల కిందట ఉమ్మడి కడప జిల్లాలో మండలాల వారీగా ఎకరాల్లో పసుపు సాగును పరిశీలిస్తే మైదుకూరులో 1675 ఎకరాలు, దువ్వూరులో 1255, చాపాడులో 707.5, ఖాజీపేటలో 1300, బి. మఠంలో 195, సికె దిన్నెలో 1032.5, పెండమర్రిలో 387.5, మైలవరంలో 437.5, జమ్మల మడుగులో 225, కాశినాయనలో 925, పోరుమామిళ్లలో 587.5 , కలస పాడులో 187.5, ఒంటి మిట్టలో 525, సిద్ధవటంలో 330, నందలూరులో 390, చిట్వేలు 130, పుల్లం పేటలో 220, ఓబులవారిపల్లిలో 47.5, రాజంపేటలో 355, రైల్వేకోడూరులో 212.5, రాజు పాలెంలో 100 ఎకరాల్లో సాగు అయ్యేది. ప్రతి ఏడాది సాగు ఖర్చులు పెరగడం దిగుబడి తగ్గడంతో జిల్లాలో ఏటా వందల ఎకరాలు పసుపు సాగు తగ్గుతుంది.


సీతారామపురం వద్ద సాగులో ఉన్న పసుపు పంట

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 3200 ఎకరాల్లో మాత్రమే పసుపు పంట సాగు అయినట్లు సమాచారం. ముఖ్యంగా మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలంలో సాగుకు రైతులు అనాశక్తి చూపుతున్నారు. ఈ ఏడాది మార్కెట్‌లో వ్యాపారులు ప్రారంభంలో రూ.6500 కొనుగోలు చేసి, రైతులు పసుపు దిగుబడిని పూర్తిగా అమ్ముకున్న తరువాత ధరలు అమాంతం పెంచారు. రూ.11వేల వరకు పలికింది. . ఇలాంటి పరిస్థితుల్లో పసుపు పంట సాగు చేసే నష్టాల్లో కూరుకుపోవడంతో ఎందుకని రైతన్నలు ఆసక్తి చూపలేదని తెలుస్తోంది .

నిలకడగా లేని ధరలు...

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సిఎసిపి వారు పసుపు పంటకు కనీస మద్దతు ధర, గిట్టుబాటు ధర నిర్ణయించడం లేదు. జిల్లాలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీలో పసుపు పంటకు మార్కెట్ సౌకర్యం ఉంది. మన రాష్ట్రంలో మన జిల్లాతో పాటు దుగ్గిరాల మార్కెట్ యార్డులో అమ్మకాలు జరుపుతారు. ధరల నిర్ణయం పూర్తిగా వ్యాపారస్తులదే. పసుపు గ్రేడింగ్ అధికారులు మాత్రం నామమాత్రంగా అందుబాటులో ఉంటున్నారు. సరైన గిట్టుబాటు ధరలు వచ్చేంతవరకు నిల్వ ఉంచుకునేందుకు నిల్వ సౌకర్యం అందుబాటులో లేదు. గత ఏడాది సాగైన పంటకు ప్రభుత్వం క్వింటాకు రూ. 6750 గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వ ఆధ్వర్యంలో పసుపు పంటను కొనుగోలు చేశారు . అయితే ప్రభుత్వం పసుపు సేకరించిన తరువాత మార్కెట్‌లో క్వింటా రూ. 10వేలకు పైగా పలికింది.

ప్రతి ఏడాది తగ్గుతున్న సాగు..

దువ్వూరు మండలంలో పసుపు పంట సాగును గమనిస్తే 2018 - 2019లో 2500 ఎకరాలు మండలంలో పసుపు పంట సాగు చేయగా, 2019-2020లో 1800 ఎకరాలు సాగు చేశారు. 2020-2021లో 900 ఎకరాలు, 2021 -22లో 550 ఎకరాలు, 2022-23 లో 290 ఎకరాలలో మాత్రమే పసుపు పంట సాగు చేశారు. ప్రస్తుతం 250 ఎకరాలలోపు మాత్రమే సాగు చేశారు. జిల్లెల్ల, కానగూడూరు, పెద్ద జొన్న వరం, రామసాయినగర్, గుడి పాడు, భీమునిపాడు, రామాపురం, వెంకుపల్లి, సి. ఎస్ పల్లి, మది రేపల్లె, సంజీవరెడ్డిపల్లి ప్రతి సంవత్సరం పసుపు పంట తగ్గుతూ వస్తుందని ఉద్యానశాఖ అధికారులు తెలుపు తున్నారు. చాపాడు మండల పరిధిలో కూడా పసుపు సాగు గణనీయంగా తగ్గు ముఖం పట్టింది. గత ఏడాది 195 మంది సాగు చేపట్టగా ఈ ఏడాది వంద మందికి పరిమితం అయినది. పసుపు పంట దిగుబడి తగ్గుతుండటం, గిట్టుబాటు ధర లేకపోవడం, 10నెలల పాటు పంటకు సంరక్షణ చేయాల్సి ఉండటంతో నష్టాలు వస్తున్నాయని అందువల్లనే వేరే పంటలపై మొగ్గుచూపుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. పండిన పంటకు మద్దతు ధర ప్రకటించలేదని, ప్రభుత్వం కొనుగోలు పూర్తి చేయటం లేదని , ధరలు నిలకడగా ఉండటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఒక సంవత్సరం కొనుగోలు చేసి తరువాత తిరిగి ఏడాది కొనుగోలు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మద్దతు ధర రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు కేటాయించాల్సిందిగా పసుపు పండించే రైతులు కోరుకుంటున్నారు.

సాగు ఖర్చులు అధికమవుతున్నాయి

పసుపు పంట సాగుకు ఎకరాకు రూ. 80 నుంచి లక్ష వరకు ఖర్చు అవుతున్నాయి. దిగుబడి మాత్రం 30 నుంచి 35 క్వింటాళ్లు మాత్రమే వస్తుంది. ప్రస్తుతం ఉన్న ధరలకు సాగు ఖర్చులు కూడా రావడం లేదు. రూ. 10,000 వరకు పసుపు పంటకు ధరలు ఉంటే ఖర్చులు పోను కాస్త మిగులుతుంది.ప్రభుత్వం పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. **-రామసుబ్బారెడ్డి, రైతు, సీతారామపురం.**

ధరలు లేక సాగు పూర్తిగా తగ్గించాం

గతంలో నాలుగు నుంచి ఐదు ఎకరాలలో పసుపు పంటను సాగు చేపడుతూ ప్రస్తుతం తగ్గించాం .ప్రతి ఏడాది గిట్టుబాటు ధర లేక నష్టాలు మిగులుతున్నాయి. దీంతో పసుపు పంట సాగు కు ఆసక్తి తగ్గింది. పసుపు పంట ఏడాదిపాటు సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. .గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇతర పంటలపై ఆధార పడుతున్నాం.

- మనోహర్ రెడ్డి , చాపాడు.

అధైర్య పడొద్దు.. ధైర్యంగా ఉండండి

- వైసిపి శ్రేణులకు వై.ఎస్.జగన్ భరోసా


ప్రజాశక్తి-వేంపల్లె/పులివెందుల టౌన్

వైసిపి శ్రేణిలు అందరూ అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా శనివారం తొలిరోజు బెంగళూరు నుండి కడప ఎయిర్ పోర్ట్‌కు ప్రత్యేక విమానంలో వచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన పెండ్లిమర్రి మండలంలోని మాచునూరు గ్రామానికి వెళ్లి ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందిన మాచునూరు సర్పంచ్, మండల కన్వీనర్ నైనా మాచునూరు చంద్ర ఇంటికి వెళ్లారు. మాచునూరు చంద్ర చిత్ర పటానికి నివాళు లర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని చంద్ర కుటుంబ సభ్యులకు జగన్ చెప్పారు. మాజీ సిఎం జగన్ మాచునూరుకు రావడంతో ప్రజలు, వైసిపి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. జగన్‌తో కరచాలం చేసేందుకు జనాలు ఎగబడ్డారు. ప్రతి నాయకునిడిని కలిసి యోగ క్షేమాలు తెలుసు కున్నారు. అనంతరం మాచునూరు నుండి గొందిపల్లెకు వెళ్లిన జగన్ ఇటివల వివాహం జరిగిన రామచంద్రారెడ్డి తనయుడునైన కడప మార్కెట్ యార్డు కమిటీ మాజీ ఛైర్మన్ చంద్రహసరెడ్డి కుమార్తె ఆశారెడ్డి, శివారెడ్డి నూతన దంపతులను ఆశీర్వాదించారు. అక్కడికి కూడా జనాలు భారీ సంఖ్యలో రావడంతో ప్రతి ఒక్కరిని పలుకరించారు. జగన్ రాక కోసం మధ్యాహ్నం మూడు గంటల నుండి నందిమండలం, తగేండుపల్లె, కొత్తూరు, వేంపల్లెలోని హనుమాన్ జంక్షన్, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాల్లో జనాలు వేచి చూశారు. ఆలస్యం అయినప్పటికీ జగన్ కోసం వేచి చూశారు. వేంపల్లెకి వచ్చేసరికి రాత్రి 8 గంటల సమయంలో వెళ్లారు. అక్కడ మహిళాలు హారతులిచ్చారు. వైసిపి నేతలకు, కార్యకర్తలకు అభివాదం చేసి వేముల మీదుగా పులివెందులకు వెళ్లారు. జగన్‌ను ఘన స్వాగతం పలికిన వారిలో కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలయ్య, దేవస్థానం మాజీ చైర్మన్ కుర్రాకుల వెంకటేష్, ముత్యాల ఆంజనేయులు, కమతం రాజా, ఎంపిటిసి భారతి, మైనార్టీ నేత షెక్షావలి, వైసిపి నేతలు పాల్గొన్నారు. జగన్ రాత్రికి పులివెందులలో బస చేశారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

5న ధర్నాను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు


పోస్టర్లు ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 5న తిరుపతి ఎస్‌పిడిసిఎల్ వద్ద నిర్వహించబోయే ఆందోళనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రామాంజులు, ఉపాధ్యక్షులు ఏ. వి. రమణ కోరారు. శుక్రవారం స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో తిరుపతి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిస్కం అధ్యక్షులు కె. సుబ్రహ్మణ్యం రాజు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 23,500 మంది విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 2022 పిఆర్‌సి ఏరియర్స్ ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న అన్ స్కిల్డ్ కార్మికులకు స్టిల్ చేసి స్కిల్డ్ వేతనం ఇవ్వాలని, కొత్త ఆపరేటర్లకు, పాత ఆపరేటర్లకు సమానంగా వేతనాలు ఇవ్వాలని, ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్ మెన్ ను నియమించాలని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని స్తున్న ఐటిఐ విద్యార్హత ఉన్న అన్ స్కిల్డ్ కార్మికులకు స్కిల్డ్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని, కొత్త ఆపరేటర్లుగా ఉన్న వారందరికీ పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని కోరారు. మీటర్ బిల్ ఏజెన్సీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి ఎస్‌పిఎం కార్మికులకు కనీస వేతనం, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను చేపట్టి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు, కార్మికుడికి, కార్మిక కుటుంబాల్లో ఏదైనా అనారోగ్య సమస్యలు వచ్చిన ప్రమాదాలు సంభవించినప్పుడు పూర్తిగా ప్రభుత్వమే వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. చలో తిరుపతి కార్యక్రమానికి జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరూ పాల్గొని ధర్నా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుఇఇయు ప్రధాన కార్యదర్శి ఎ.వి. రమణ యుఇసిడబ్ల్యుయు డివిజన్ అధ్యక్షులు నగేష్ గౌడ్, ఉపాధ్యక్షులు ఖాదర్ బాషా, నాయకులు రామాంజులు, శ్రీధర్, విశ్వనాథ, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న తిరుపతిలో సిఎండి ఆఫీస్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. విద్యుత్ ఎడి ఆఫీస్ వద్ద డిమాండ్స్‌తో కూడిన పోస్టర్స్‌ని ఆవిష్కరించారు. చలో తిరుపతి కార్యక్రమానికి జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరూ పాల్గొని ధర్నా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుఇఇయు సబ్ డివిజన్ కార్యదర్శి, కుమార్ స్వామి, సహాయ కార్యదర్శి వేణు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ రాజు, అల్లా బకాష్, చంగల్ రాయుడు, గుప్త పార్వతి, ఎస్‌పిఎం హమాలీలు, పీస్ రేటు కార్మికులు పాల్గొన్నారు.



హ్యాకథాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రనాథ్

'మిట్స్'లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో ఇంటర్నల్ హ్యాకథాన్‌ను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా బెంగళూర్ కాంగ్నిజెంట్ టెక్నాలజీ సోలుషన్స్ రిక్రూట్మెంట్ హెచ్‌ఆర్ చంద్రనాథ్ భట్ల మాట్లాడుతూ విద్యార్థులలో టెక్నాలజీ నూతన ఆలోచనలను పెంపొందిచడానికి ఇది ఒక మంచి అవకాశమన్నారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ అనేది దైనందిన జీవితంలో ఎదురయ్యే కొన్ని ముఖ్యమైన సవాళ్లను పరిష్కరించడంలో విద్యార్థులను నిమగ్నం చేయడానికి రూపొందించబడిన ఒక ప్రధాన దేశవ్యాప్త కార్యక్రమని, ఇందులో ఎంతో మంది టెక్నికల్ విద్యార్థులు వారి వారి ఆలోచనలు ఇతరులతో పంచుకుంటారని పేర్కొన్నారు. ఆవిష్కరణ, ఆచరణాత్మక సమస్య-పరిష్కార సంస్కృతిని పెంపొందించడానికి ఇది ఒక మంచి ప్లాటిఫార్మ్ అని, అధ్యాపకులకు, విద్యార్థులకు ఇది ఒక ఆమంచి అవకాశమన్నారు. దీని ద్వారా విద్యార్థులలో నూతన టెక్నాలజీపై స్కిల్స్ పెంపొందిచుకోవచ్చన్నారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ జాతీయ స్థాయి లో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు ప్రపంచంలోనే అతిపెద్ద హ్యాక్ తాన్ ను ప్రతి సంవత్సరము నిర్వహిస్తుందని, దీనికి భారత దేశంలోని ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటారన్నారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ అనేది మన దైనందిన జీవితంలో మనం ఎదుర్కొనే కొన్ని ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడానికి విద్యార్థులకు ఒకే మంచి వేదికను అందించడానికి భారత దేశ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందిచిందన్నారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలతో పాటు నూతన ఆవిష్కర్తలు ప్రోత్సహించడంలో ఇలాంటి హ్యాకథాన్‌లు చాలా అవసరమన్నారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో సహా పలు డొమైన్‌లలో హ్యాకథాన్ సవాళ్లను పరిష్కరించడానికి కలశాల విద్యార్థులు గ్రూప్‌లుగా ఉండి సుమారు 80 టీంలు ఇందులో తమ ఆలోచనలను ప్రదర్శించారని, ఉత్తమ ప్రదర్శనలు ను మెయిన్ హ్యాకథాన్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ డీన్ వేణు చౌదరి, సిఎస్ఇ(ఎఐ) విభాగాధిపతి డాక్టర్ చొక్కనాదన్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి మృతి



ప్రజాశక్తి - రాయచోటి : మండలంలోని యండపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ కె.జయచంద్రరెడ్డి బావమరిదియైన పెద్దిరెడ్డి నరసింహారెడ్డి శుక్రవారం రాత్రి మదనపల్లెలో మృతి చెందారు. శనివారం ఉదయం జంగంరెడ్డిగారిపల్లెలో తన స్వగృహానికి చేరిన భౌతిక కాయానికి యండపల్లిలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేసే ఆరోగ్య సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారుడు డాక్టర్ సాగర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - రాయచోటి

కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల గర్ల్స్ హాస్టల్ వాష్ రూమ్స్‌లో హిడెన్ కెమెరాలు బయటపడ్డాయిని రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని నిష్పక్షపాతంగా దోషులను కఠినంగా శిక్షించాలని పిడియస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని శనివారం మాసాపేట ప్రాంతంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరు కళాశాలలో చదువుతున్న విద్యార్థులే సీనియర్స్ కొంతమంది సహాయంతో గర్ల్స్ హాస్టల్ వాష్ రూమ్స్‌లో కెమెరాలను అమర్చినట్టు విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ విషయం యాజమాన్యానికి వారం రోజుల కిందటే విద్యార్థునులు తెలియజేసినప్పటికీ యాజమాన్యం ఈ సంఘటన పైన ఎలాంటి చర్యలు చేపట్టలేదున్నారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పటికీ పోలీస్ కంప్లైంట్ కానీ , సదరు వ్యక్తుల మీద ఎలాంటి చర్యలు కానీ చేపట్టకపోవడం అనేది ఆశ్చర్యాన్ని గురిచేస్తుందిన్నారు. ఇందులో కేవలం సీనియర్ విద్యార్థుల ప్రమేయమే ఉందా లేదా యాజమాన్యం, అక్కడ పనిచేసే వ్యక్తుల ప్రమేయం ఉందా అనే విషయానికి సంబంధించి సమగ్ర విచారణ చేయించాలని పేర్కొన్నారు. ఈ సంఘటన పౌర సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసే విధంగాను, అత్యంత పతనమైన దిగుజారుడు సామజిక పరిస్థితులకు నిదర్శనంగా ఉందన్నారు. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. స్త్రీ లను ఆటవస్తువుగా చూసే వాతావరణం ఏర్పాడడానికి కారణమవుతున్న పోర్నోగ్రఫీ, డ్రగ్స్, ఆల్కహాల్‌ను పూర్తిస్థాయిలో బ్యాన్ చేయాలని, సెన్సార్ బోర్డు ఆధారంగా స్త్రీనిసినిమాలలోను, సీరియస్స్‌లోను అసభ్యంగా చూపించే చర్యలకు అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం వైఖరిని మార్చుకోవాలని చెప్పారు. విద్యార్థులకు భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాయచోటి పట్టణ నాయకులు అష్ఫల్ బాష, సమీర్, భరత్, సాగర్ సాజిద్, ప్రసాద్, కిరణ్,శివ, అమృత్ పాల్గొన్నారు.

మంచి మనసు చాటుకున్న కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన ముగ్గురు మహిళలకు ఆర్థిక సాయం చేసి కలెక్టర్ శ్రీధర్ చామకూరి మంచి మనసును చాటుకున్నారు. కోడూరు గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవి, ఓబులవారిపల్లికి చెందిన కల్పన, చిట్వేలు మండలానికి చెందిన బొంతల కుమారి ఈనెల 23న గౌరవ ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ జిల్లా పర్యటనలో తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. వీరి అర్జీల గురించి రైల్వే కోడూరు ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ స్వయంగా రాయచోటికి విచ్చేసి కలెక్టర్‌కు వివరించారు. వీరి అర్జీలకు స్పందించిన కలెక్టర్ కలెక్టరేట్ నిధుల నుంచి ఆర్థిక సాయం అందించారు. కోడూరు గ్రామ పంచాయతీలో స్వీపర్గా పనిచేస్తున్న లక్ష్మీదేవి, తన మనవరాలుకు లివర్ సమస్య కారణంగా ప్రతినెలా అధిక మొత్తంలో ఖర్చు వస్తోందని, ఆర్థిక సహాయం చేయవలసిందిగా విన్నవించుకోగా కలెక్టర్ ఆమెకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. ఓబుల వారిపల్లికి చెందిన కల్పన, తన తండ్రిని కోల్పోయానని ఆర్థిక సాయం చేయవలసిందిగా రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. చిట్వేలు మండలానికి చెందిన బొంతల కుమారి తన కుమార్తెకు డయాబెటిస్ వ్యాధి కారణంగా ప్రతినెల అధిక మొత్తంలో ఖర్చు వస్తోందని ఆర్థిక సాయం చేయవలసిందిగా కోరగా ఆమెకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు.


మాట్లాడుతున్న తహశీల్దార్ భీమేశ్వరరావు

చట్టాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-పీలేరు

ఎస్‌సి, ఎస్‌టి ప్రజలకు వారికున్న చట్టాల పట్ల అవగాహన కల్పించడం కోసమే ఈ సివిల్ రైట్స్ డే ప్రతినెలా నిర్వహించడం జరుగుతుందని తహశీల్దారు భీమేశ్వరరావు తెలిపారు. శనివారం పీలేరు మండలం, వేపులబైలు పంచాయతీ, రెడ్డివారిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో తహశీల్దారు అధ్యక్షతన ఎస్‌సి, ఎస్‌టి ప్రజలతో పాటు గ్రామంలోని ఇతర వర్గాల ప్రజలతో సమావేశమై సివిల్ రైట్స్ డే ముఖ్య ఉద్దేశాలను వివరించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసు మేరకు ప్రతి నెల చివరి తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించి ఎస్‌సి, ఎస్‌టి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి, వారి మధ్య ఉన్న అసమానతలను, వివక్షను తొలగించాలన్న ఉద్దేశంతో ఈ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని ఎస్‌సి, ఎస్‌టి ప్రజలను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే వారెంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. అనంతరం భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ రెడ్డివారిపల్లి రాములవారి గుడిలోకి ఎస్సీలను రానివ్వకుండా అగ్రవర్ణాల వారు అడ్డుకుంటున్నారని ఎస్‌సి ప్రజలకు ఆలయ ప్రవేశం కల్పించాలని అదేవిధంగా ఎస్‌సి, ఎస్‌టి డ్వాక్రా మహిళలకు రావలసిన లోన్లు మంజూరు విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో మంజూరయ్యేలా చూడాలని అధికారులను కోరారు. మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీ వాసులకు శాశ్వత స్మశాన వాటికకు స్థలం చూపాలని, ఎస్‌సి కాలనీలో మురుగునీటి కాలువలు నిర్మించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం లక్ష్మణ్‌రెడ్డి, ఎఎస్ఐ హేమ సుందర్, ఇరిగేషన్ ఎఇ యతిరాజులు, ఆర్ఐ చాణిక్య, జూనియర్ అసిస్టెంట్ రెడ్డప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఇడుపులపాయకు షర్మిల రాక

ప్రజాశక్తి - వేంపల్లె : కడప జిల్లా పర్యటనలో భాగంగా ఇడుపులపాయకు పిసిసి చీఫ్ షర్మిలా రానున్నారు. ఈనెల 3వ తేదీ వరకు జిల్లాలో కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటారు. హైద రాబాద్ నుంచి బయలుదేరి ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఇడుపులపాయకు చేరు కుంటారు. రాత్రి ఇడుపులపాయలోని గెస్ట్ హౌస్ బస చేస్తారు. 2న ఉదయం 8 గంటలకు ఇడుపులపాయలో ఉన్న వైఎస్‌ఆర్ సమాధి వద్దకు వెళ్లి వైఎస్‌ఆర్ వర్ధంతి సందర్భంగా ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పిస్తున్నారు. అనంతరం ఇడుపులపాయ నుంచి కడపకు బయలుదేరి డిసిసి కార్యాలయంలో సాయంత్రం 5 గంటల వరకు నాయకులు, కార్యకర్తలను కలిసి పార్టీ బలోపేతంపై చర్చిస్తారు. 3న కడపలో ఉన్న జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తారు. 12.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు డిసిసి కార్యాలయంలో జిల్లా నాయకులు, కార్యకర్తలతో కలిసి జిల్లా సమస్యలను తెలుసుకుంటారు. అనంతరం తిరిగి ఇడుపులపాయకు వెళ్తారు. 4న 11.40 గంటలకు కడప ఎయిర్ పోర్ట్‌కు వెళ్లి అక్కడ నుండి విజయవాడకు బయలుదేరుతారు.

డివిజన్ కార్యాలయాన్ని వినియోగంలోకి తేవాలి : యుటిఎఫ్


మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎడ్యుకేషన్ డివిజన్ కార్యాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం యుటిఎఫ్ నాయకులు ఎడ్యుకేషన్ డివిజన్ కార్యాలయం వద్ద సమావేశమై మాట్లాడుతూ రాష్ట్రంలోని 53 ఎడ్యుకేషన్ డివిజన్‌లను 74 డివిజన్లుగా మార్పు చేస్తూ విద్యా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రాజంపేటను కూడా ఎడ్యుకేషన్ డివిజన్‌గా పేర్కొంటూ 9 మండలాలను కలిపి ప్రకటించారని తెలిపారు. ఏడాది గడిచినప్పటికీ డివిజన్ విద్యా శాఖ కార్యాలయం తలుపులు తెరుచుకోలేదన్నారు. ఉప విద్యా శాఖాధికారి గానీ, సిబ్బంది గానీ ఈ కార్యాలయంలో లేకపోవడం వల్ల డివిజన్ కేంద్రం ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. మదనపల్లి ఉప విద్యా శాఖాధికారిని అదనపు బాధ్యతలతో రాజంపేటకు కేటాయించినట్లు సామాజిక మాధ్యమం ద్వారా సమాచారముందని తెలిపారు. పాఠశాలల సమస్యలు, పర్యవేక్షణ, విద్యా శాఖ కార్యక్రమాల అమలు మరియు ప్రధానోపాధ్యాయులకు సంబంధించిన సర్వీసు విషయాల పరిష్కారం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన చెందారు. నేటికీ ఈ డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వివిధ రకాల పనుల నిమిత్తం జిల్లా కేంద్రం పైనే ఆధారపడవలసి రావడం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోందని విచారం వ్యక్తం చేశారు. విద్యా శాఖ అధికారులు వెంటనే స్పందించి రాజంపేట డివిజన్ విద్యా శాఖ కేంద్రం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో రాజంపేటలోని డివిజన్ విద్యా వనరుల కేంద్రంలో కొందరు అధికారులు విద్యా శాఖ పరిపాలన చేపట్టారని, పూర్వ జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి హయాంలో ఈ కేంద్రాన్ని డిఇఒ క్యాంపు కార్యాలయంగా మార్పు చేసినప్పటికీ ఇక్కడ కార్యకలాపాలు నిర్వహించలేదన్నారు. నిరుపయోగంగా ఉన్న డిఆర్‌సి భవనాన్ని డివిజన్‌లోని ఉపాధ్యాయులకు సౌలభ్యం కలిగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్ రాజు, జిల్లా కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, నాయకులు పాపయ్య, శ్రీనివాసులు, సాంబశివరావు, నరసింహా రావు, రఫి, శివ కుమార్, వెంకట సుబ్బయ్య, విశ్వనాథ్, వేణుగోపాల్, మల్లిఖార్జున పాల్గొన్నారు.



సరస్వతిదేవి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న ఎంఇఒ రామకృష్ణుడు

పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-రామాపురం

పాఠశాల ఆవరణంలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్టాపన చేయడం శుభపరిమా పరిణా మమని ఎంఇఒ రామకృష్ణుడు పేర్కొన్నారు. మండలంలోని గోపగుడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో శ్రావణమాసం చివరి శనివారం రోజున అదే గ్రామానికి చెందిన విశ్రాంత ఎల్ఐసి ఉద్యోగి చెంగ్రా యుడు తన సొంత ఖర్చులతో సరస్వతిదేవి విగ్రహాన్ని అందజేశారు. ఎంఇఒ రామకృష్ణుడు హాజరై విగ్ర హాన్ని ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ముందుకు వచ్చి సరస్వతి దేవి విగ్రహాన్ని పాఠశాలలోఏర్పాటు చేయడం సంతోషదాయకమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇలియాజ్అహ్మద్, గ్రామపెద్దలు పందిళ్ళపల్లి బలరామయ్య, చెనరాయుడు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-కలకడ



ఎస్ఐ రామాంజనేయులు

గణేష్ మండపాల ఏర్పాటు కోసం తప్పనిసరిగా అనుమతి పొందాలని ఎస్ఐ రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 7న జరుపుకోనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా పలు గ్రామాలలో విగ్రహాలను ఏర్పాటు చేస్తారని, .విగ్రహాలు ఏర్పాటు చేయడానికి తప్పక పోలీసుల అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గణేష్ నెట్ సేవ్ డాట్ నెట్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఇందులో మండపాలు ఏర్పాటు చేయు కమిటీ సభ్యుల పేర్లు నమోదు చేసి ఏ పోలీసు స్టేషన్ పరిధిలో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న విషయం తెలియపరిస్తే ఆన్‌లైన్ ద్వారా అనుమతులు లభిస్తాయని అన్నారు. అంతేకాకుండా 79950 95800 వాట్సాప్ నెంబర్‌కు హాయ్ అనే మెసేజ్ పంపినచో మంటపాలు ఏర్పాటు చేయడానికి కావలసిన పరిపూర్ణమైన వివరాలు తెలుస్తాయని తెలిపారు.ఈ విషయాన్ని మండపాలు ఏర్పాటు చేయగల కమిటీ సభ్యులు గమనించుకోవాలని గుర్తు చేశారు.

ఉద్యాన డిప్లొమా ప్రవేశానికి మరో అవకాశం

ప్రజాశక్తి-కలికిరి

ఉద్యాన డిప్లొమా కోర్సు ప్రవేశానికి మరొక అవకాశం కల్పించినట్లు ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ బయన్న తెలిపారు. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంచే గుర్తింపు పొందిన ప్రయివేట్ ఉద్యాన పాలిటెక్నిక్ రెండు సంవత్సరాల హార్టికల్చర్ డిప్లొమ కోర్సునకు 2024-25 విద్యా సంవత్సరం చివరి, స్పాట్ మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఆన్‌లైన్ ధరఖాస్తు చేసికొనని అభ్యర్థులు కూడా కౌన్సిలింగ్‌కు హాజరై స్పాట్ రిజిస్ట్రేషన్ లేదా దరఖాస్తు చేసుకొని డిప్లొమా కోర్సులో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. పదవ తరగతిలో సాధించిన మార్కులు మెరిట్ ఆధారంగా సీటు కేటాయింపబడుతుందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు రూ.800లు స్పాట్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవలసి ఉంటుందని అన్నారు. ఇది వరకే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఏవిధమైన రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవలసిన అవసరం లేదని, కౌన్సిలింగ్ లో సీట్ల కేటాయింపు పొందిన అభ్యర్థులు నిర్ణీత ఫీజును చెల్లించి ఆయా పాలిటెక్నిక్‌లో చేరవలసి ఉంటుందని, ప్రభుత్వ నిబంధనలు అనుసరించి కౌన్సిలింగ్ జరుగుతుందని తెలిపారు. అడ్మిషన్ సమయంలో ఒరిజినల్ సర్టిఫికేట్లు ఎస్ఎస్‌సి, పారం-1, టిసి, స్టడీ సర్టిఫికేట్లు (4 నుంచి 10వ తరగతి వరకు), నివాస ధృవీకరణ పత్రం, ప్రత్యేక కేటగిరీల కింద ఎంపికైన అభ్యర్థులు (ఎన్‌సిసి / ఎన్‌ఎస్ఎస్ / పిహెచ్ /స్పోర్ట్స్ గేమ్స్) కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన ఒరిజినల్ సర్టిఫికేట్లను సమర్పించాలని కోరారు.

దీర్ఘకాలిక వ్యాధులకు ఉచిత పరీక్షలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చౌడూరు సచివాలయం కారేదలపల్లెలో వైద్యాధికారి జి.హనీఫ్ బాషా ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌లో దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేయించుకుని మందులు పొందవచ్చన్నారు. దీర్ఘకాలిక జబ్బులకు చికిత్స, సల హాలు పొందవచ్చునని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బివి వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ గౌతమి, ఎఎన్‌ఎం వేదవతి, ఆశ దేవరాజ్, పైలెట్ రామనాథ్,వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.

'నిజాయితీ వ్యవస్థను నిర్మించాలనుకుంటున్నా'

- ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే ప్రసక్తే లేదని, నిజాయితీగల వ్యవస్థను నిర్మించాలనుకుంటున్నానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఆయన బావమరిది మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారురెడ్డి తనపై, తన కుటుంబ సభ్యులపై చేస్తున్న లేనిపోని అభియోగాలను ఖండిస్తున్నానన్నారు. తన రాజకీయ చరిత్రలో ఎన్నడూ నేను అవినీతికి పాల్పడలేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మీ హయాంలో గుట్కా, మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించారని ఆరోపించారు. ఎన్‌వివిఆర్ అనే అక్షరాలు ఏ వాహనం మీద ఉంటే ఆ వాహనం నాదైపోతుందా అని ప్రశ్నించారు. తన పేరుతో అనేక గ్రామాలలో అనేక మంది పేర్లు ఉంటాయని అంతమాత్రాన అవి నా వాహనాలే అని ఎలా చెబుతారన్నారు. మా . మట్కా, క్రికెట్ బెట్టింగ్, గుట్కా, అక్రమ ఇసుక రవాణా వంటి చట్ట వ్యతిరేక పనులు ఎవరు చేసినా కఠినంగా వారిని చట్టపరంగా శిక్షించాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇవి సుధాకర్‌రెడ్డి, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు బొగ్గుల వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బ్రెడ్డు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు శనివారం సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం స్థానిక 3వ వార్డు క్రిస్టియన్ లైన్‌లో టిడిపి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది చేపట్టారు. లబ్ధిదారులకు ఇంటి దగ్గరికే పెన్షన్ అందించడం ప్రభుత్వ ధ్యేయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెన్షనర్లకు తూగుట్ల ప్రేమ్‌సాగర్‌రెడ్డి పండ్లు, బ్రెడ్ అందజేశారు. సచి వాలయ సిబ్బంది శుబాన్ బీ, శ్యామ్, రాజ్‌కుమార్, యోబు, శిఖామణి, చిన్న పాల్గొన్నారు.

సంక్షేమ పాలన చంద్రబాబుకే సాధ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

సంక్షేమ పాలన ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. శనివారం మండలంలోని కొండయ్యగారిపల్లె, నిమ్మనపల్లె, అగ్రహారం, సామకోట వారిపల్లె, తవళంలో గ్రామాలలో స్థానిక సర్పంచ్‌లు, టిడిపి, జనసేన నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు,వితంతువులకు ప్రభుత్వం అందిస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.4వేలు అందిస్తుందని తెలిపారు. పింఛన్ దారులకు 31వ తేదీనే పింఛన్ అంది స్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, సర్పంచ్‌లు ఆర్.వరలక్ష్మి, పాపులమ్మ మల్లప్ప, ఉషారాణి, మహాదేవ రెడ్డి, శ్రీవాణి నవీన్, రెడ్డప్ప, మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, బిసి సాధికార సమితి జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మన్న, మాజీ ఎంపిపి రెడ్డప్పరెడ్డి, రాజన్న, శ్రీపతి, ఆనంద, మల్లికార్జున, జనసేన మండల ఉపాధ్యక్షులు ఈతకట్ల చంద్రశేఖర్, కళ్యాణ్ సింగ్, ఎంపిడిఒ రమేష్‌బాబు, ప్రభుత్వ అధికారులు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్రమైన కలకడలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించినట్లు ఎంపిడిఒ పరమేశ్వరరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి 95 శాతం పూర్తయినట్లు తెలిపారు. .మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న సిబ్బంది పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు.ప్రతి గ్రామంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని పింఛన్ల కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు సహకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** మదనపల్లి రూరల్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సాయంత్రం వరకు వివిధ ప్రదేశాల్లో జరిగిన పంపిణి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మదనపల్లి రూరల్ నందు ఎంపిడిఒ భాను ప్రసాద్ తో పాటు స్థానిక టిడిపి నాయకులు, సచివాలయం సిబ్బంది, మదనపల్లి టౌన్‌లో మునిసిపల్ కమీషనర్ ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో నాదెళ్ల విద్యాసాగర్, షంషీర్, నాగూర్ వలి, నాదెళ్ల శివ, 34వ వార్డు ఇన్‌ఛార్జి బొమ్మిశెట్టి పురుషోత్తం, కోళ్లబైలు ఇంఛార్జ్ ఆర్.శ్రీనివాసులునాయుడు, 35 వార్డు మాజీ కౌన్సిలర్ రామిశెట్టి ఆంజనేయులు, ఎర్రబెల్లి వెంకటరమణరెడ్డి, తులసి రామకృష్ణ, మోడెం సిద్దప్ప, రామిశెట్టి నీలకంఠ, రామిశెట్టి కృష్ణ (కమాలమర్రి), తమ్మిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు. **రామసముద్రం:** పింఛన్ల కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చెంబకూరు, అరికెల, మాలే నత్తం, మినికి, చోక్కాండ్లపల్లి, ఎలువనెల్లూరు, ఊలపాడు పంచాయతీలలో లబ్దిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ , మాజీ మండల పార్టీ అధ్యక్షులు నారాయణరెడ్డి , కృష్ణంరాజు, తిప్పన్న, రామ్మూర్తి, వికాస్ స్వామి, వెంకటేశ్ , సుధాకర్ రెడ్డి, చోక్కాండ్లపల్లి పెద్దిరెడ్డి పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో శనివారం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపిడిఒ సురేంద్రనాథ్, ఇఒఎంఆర్‌డి దిలీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో 6244మంది పింఛన్ దారులకు రూ.2.69 కోట్ల రూపాయలు పంపిణీ చేయాల్సి ఉండగా 6153 మంది పెన్షన్ దారులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. అందుబాటులో లేక పింఛన్లు పొందని వారు సోమవారం తీసుకోవచ్చని అన్నారు.



నిమ్మనపల్లి: పింఛన్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కోనెయ్యగారిపల్లి గ్రామంలో శనివారం డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వ ర్యంలో గ్రామస్థాయి సిబ్బందితో కలిసి ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంప్‌లో డాక్టర్ మనోజ్ చంద్ర మాట్లాడుతూ దాదాపు 56 మందిని పరీక్షించి వారికి సాధారణ జలుబు, దగ్గు వైరల్ సంబంధించి సమస్యలను గుర్తించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనుమానంగా ఉన్న ఐదు గురికి ఆర్‌డిటి కిట్ ద్వారా రక్త నమూనాలు సేకరించి పరీక్షించినట్లుపేర్కొన్నారు. సీజనల్ వ్యాధులలో భాగంగా దోమల ద్వారా వ్యాపించే మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులపై గ్రామ ప్రజ లకు అవగాహన కల్పించారు. దోమకాటు ఆరోగ్యానికి చేటు, దోమల నివారణ చర్యలు పాటించి ఆరోగ్యంగా జీవించాలని తెలిపారు. మన ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే అన్నారు. నీరు నిల్వ ఉన్న నీటి కుంటలు, లోతట్టు ప్రాంతాలు, నిర్మాణ స్థలాలు, చెరు వులో, వాడని నీటిబావులు, దోమల వృద్ధికి నిలయానికి తెలిపారు. ఇవి లేకుండా జాగ్రత్తలు తీసు కోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సోనీ, ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం..పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి-కలికిరి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని వఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుంధతి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అంగన్వాడీ కేంద్రాలలో తల్లి పేరు మీద ఒక చెట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు అంగన్వాడీ కేంద్రాల వద్ద ఒకరు ఒక చెట్టు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవాళికి చెట్లు ప్రధాన ఆధారమని, చెట్లు ద్వారానే ప్రకృతి మానవుల అనుకూలంగా మారుతుందని అన్నారు. అందువలన ప్రతి ఒక్కరూ చెట్లు నాటి ప్రకృతిని, మానవాళిని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



గుట్టపాలెంలో మొక్కలు నాటుతున్న అంగన్వాడీలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన



విద్యార్థులకు వివరిస్తున్న ట్రైనీలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య యూనివర్సిటీలో శనివారం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఈ సదస్సు శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రైనర్స్, స్మైడ్ టెక్నాలజీస్ నుంచి స్నేహలతారెడ్డి, దినేష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు డేటా సైన్స్, మిషన్ లర్నింగ్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ ప్రస్తుత తరుణంలో ఎలా అభివృద్ధి చెందుతుందో క్లుప్తంగా వివరించారు. డేటా సైన్స్‌తో ఆర్టిఫి షియల్ ఇంటలిజెన్స్ టూల్స్‌ను ఉపయోగించి విద్యార్థులచేత ప్రాక్టికల్‌గా చేయించారు. ఈ సదస్సులో వ్యవసాయంలో మొక్కల ఆరోగ్యం, వాతావరణం, డిజిటల్ సమాచారం నిర్వహణ, బ్యాంకింగ్ అప్లికేషన్, డేటా స్టోరేజ్ వంటి అనువర్తనాలు ద్వారా ఎలా అభివృద్ధి చేయాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఎఐడిఎస్ హెచ్ఒడి డాక్టర్ పి.పణీంద్ర కుమార్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ బి.వెంకటేశు గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి చట్టాల గురించి తెలుసుకోవాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఎస్‌సి,ఎస్‌టి చట్టాల గురించి తెలుసుకునేందుకే సివిల్ రైట్స్ డేను ప్రతినెలా నిర్వహించడం జరుగుతుందని తహశీల్దార్ ధనుంజయులు తెలిపారు. శనివారం మండలంలోని ముష్టూరు పంచాయతీ, గౌనివారి పల్లిలో తహశీల్దార్, ఎంపిడిఒ రమేష్‌బాబు, ఎస్ఐ తిప్పేస్వామి కలసి ఎస్‌సి,ఎస్‌టి ప్రజలతో పాటు గ్రామంలోని ఇతర వర్గాల ప్రజలతో సమావేశమై సివిల్ రైట్స్ డే ముఖ్య ఉద్దేశాలను వివరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసు మేరకు ప్రతి నెల చివరి తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై సమగ్రంగా ప్రజలకు వివరించి చెప్పారు. ఎస్‌సి,ఎస్‌టిలపై ఉన్న అసమానతలను, వివక్షను తొలగించాలన్న ఉద్దేశంతో ఈ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని అన్నారు. ఎస్‌సి,ఎస్‌టి ప్రజలను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అనంతరం ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు రెడ్డినారాయణ మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటి చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమని అన్నారు. దళిత కాలనీలలో రోడ్లు, డ్రెయినీ,మౌలిక వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు దళిత కాలనీలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, విఆర్ఒలు నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గౌనివారిపల్లెలో సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్న అధికారులు

చివరి శనివారం గండికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో శ్రావణ మాస చివరి శనివారం వర్షం సైతం లెక్కచేయకుండా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున నాలుగు గంటలకే ఆంజనేయస్వామి మూలవిరాట్‌ను ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకుడు రాజా స్వామి అలం కరించారు. దేవస్థాన సహాయ అసిస్టెంట్ కమిషనర్ (ఇన్‌ఛార్జి) జె.వెం కటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి మురళి నాయక్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలుస్టేషన్ల నుండి దాదాపు 270 మంది పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులకు కలగకుండా వేంపల్లి వైపు నుండి వచ్చే వాహనాలు వీరన్నగట్టుపల్లె క్రాస్ వద్ద, ఆంజనేయస్వామి దర్శనం కోసం నాలుగు గంటలపైన సమయం పట్టినట్లు భక్తులు పేర్కొంటున్నారు. కాలినడక భక్తులకు సురభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శివప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గండి క్షేత్రంలో ఆంజనేయస్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ శాంతమ్మ, హెల్త్ మేల్ అసిస్టెంట్ వెంగయ్య, రామచంద్ర, ఎఎన్‌ఎంలు లక్ష్మీదేవి, నవనీత, గండి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటస్వామి, భాస్కర్, డిఎస్‌పి మురళి నాయక్, సిఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

దారి పొడవునా భక్తులకు అన్నదానం

వేంపల్లె : శ్రావణ మాసం సందర్భంగా గండికి కాలినడకన వెళ్లే భక్తులకు దారి పొడవునా దాతలు అన్నదానం చేపట్టారు. రాయచోటి రోడ్డులో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. గండి రోడ్డులోని బృందావనం కాలనీ వద్ద టిడిపి యూత్ నాయకులు యాసిన్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, వేమా కుమార్, డక్కా రమేష్, మారుతి, మడక శ్రీను యుగంధర్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ మునికుమార్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కోసవారిపల్లి వైద్యాధికారి డాక్టర్ మునికుమార్ పేర్కొన్నారు. శనివారం ఆర్ఎన్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో వైద్యాధికారి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పాలు, గుడ్లు, ఆకుకూరలు తినాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిల్లలతో ప్రతిజ్ఞ చేశారు. బాలకార్మికుల చట్టాలు, బాల్యవివాహాల పట్ల అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, హెచ్ఎ కృష్ణనాయక్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను చేపట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న చెత్తను వెంటనే తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు కోరారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో రోడ్డుపైనే చెత్త ఎక్కువగా ఉండడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రహదారి వెంట ప్రతి రోజూ కళాశాలకు, బాలికల పాఠశాలకు విద్యార్థులు వెళుతుంటారని తెలిపారు. వర్షపు నీరు నిల్వ, రోడ్డు పక్కనే చెత్త ఉడడంతో ఆ రహదారిలో వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. విద్యార్థులు చెత్తలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించి విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వమైనా విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని యుఇసిడబ్ల్యుయు జిల్లా అధ్యక్షుడు శ్రీనువాసులు డిమాండ్ చేశారు. తిరుపతిలోని ఎస్పీడిసిఎల్ కార్యాలయం వద్ద ఈనెల 5న చేపట్టే ధర్నా విజయవంతం చేయాలని శనివారం శనివారం స్థానిక 132 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గోడ పత్రికలను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యుత్ కార్మికులకు ఇచ్చిన మాట తప్పడంతో ఇంటికి వెళ్లిందని చెప్పారు. ప్రతి విద్యుత్ కార్మికుడు తిరుపతిలో ఎస్పీడిసిఎల్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో యుఇసిడబ్ల్యుయు పులివెందుల డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, సబ్ డివిజన్ నాయకులు చంద్రశేఖర్రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీను, రాధాకృష్ణ, మనోహర్,వంశీ పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక 14వ రెవెన్యూ వార్డులోని దస్తగిరిపేటలో చౌకదుకాణం డీలర్ పబ్బతి జ్యోత్స్న తన చౌకదుకాణం ద్వారా వచ్చే కమీషన్‌ను అమరావతి రాజధాని నిర్మాణానికి విరాళం ప్రకటించారు. ఆ మేరకు ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని శనివారం అధికారులను కోరారు. ఎలాంటి ప్రతిఫలం, పారితోషికం ఆశించకుండా సేవాభావంతో స్వచ్ఛం దంగా రేషన్‌షాపు నిర్వహిస్తానని తెలిపారు. రాజధాని లేకుండా మన రాష్ట్రం ఉండకూడదనే తలంపుతో రాజధాని నిర్మాణంలో తన వంతు సహ కారం అందించాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, పౌర సరఫరాశాఖామంత్రి నాదేండ్ల మనోహర్, విద్యాశాఖా మంత్రి లోకేష్, అధికారులకు, స్థానిక ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి తెలిపానని జ్యోత్స్న తెలిపారు.

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి పునాది

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి పునాది లాంటిదని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం దేవాలయంలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణ చేతి వృత్తి దారులకు కనీస వేతనం రూ.25,000 పెంచడం, దేవాలయ ఆలయం కమిటీ బోర్డులో ఒక కమిటీ సభ్యుడిగా వారిని నియమించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయీ బ్రాహ్మణ కడప పార్లమెంటు అధ్యక్షులు గజ్జల గోవిందు,నరసయ్య, కలవటాల చక్రపాణిపాల్గొన్నారు.

క్రైం కార్నర్



పట్టుబడిన నిందితులతో పోలీసులు

కర్ణాటక మద్యం స్వాధీనం

- నలుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

కర్ణాటక మద్యంతో సహా కారు స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు పీలేరు అర్బన్ ఎస్ఐ పి.బాలక్రిష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమ సిబ్బందితో కలసి పీలేరు మండలం, దొడ్డిపల్లి పంచాయతీ, దొడ్డిపల్లి, ఆకులవారిపల్లి, మదనపల్లి రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో గస్తీ నిర్వహించి చట్ట వ్యతిరేక కార్యక్రమాల నిర్మూలనకు చర్యలు తీసుకున్నామని అన్నారు. అదే సమయంలో మదనపల్లి వైపు నుండి ఓ కారు పీలేరు వైపు రావడం గుర్తించి ఆపడానికి ప్రయత్నించామన్నారు. పోలీసు వాహనం చూసిన సదరు కారులోని వ్యక్తులు కారును వేగంగా కుమ్మరిపల్లి మార్గంలోకి మళ్లించి వెళ్లడంతో వారిని తాము వెంబడించగా, డ్రైవర్ తన కారు ఆపి అందులోంచి దూకి పారిపోయాడని చెప్పారు. ఈ సందర్భంగా కారులోని మిగిలిన నలుగురిని అదుపులోకి తీసుకొని, కారును సోదా చేయగా అందులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన రూ.7వేలు విలువచేసే 23 మద్యం బాటిళ్ల గుర్తించామన్నారు. ఆ మద్యం బాటిల్లతో సహా మహీంద్రా రెనాల్ట్ లాగన్ కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బి. గణేష్ బాబు, గణేష్ కుమార్, దేవేంద్ర, మరో బాల నేరస్తుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ నిందితుల్లోని గణేష్ కుమార్‌పై ఇదివరకే మొలకలచెరువు, బి.కొత్తకోట పోలీసుస్టేషన్లలో రెండు మద్యం అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయని అన్నారు. కారులోంచి దూకి పరారైన కారు డ్రైవర్ నాగరాజ, బాల నేరస్తుడు ఇద్దరు కలిసి మదనపల్లి పట్టణంలోని ఎంఎంసి కార్యాలయం వెనుక ఓ ఇంటిలోను, మదనపల్లి పట్టణంలోని బికెపల్లి, అంగళ్లలో ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు చెప్పారు. నిందితులు పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నారని అన్నారు. పట్టుబడిన ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించి, బాలనేరస్తుడిని బాలల గృహనికి పంపినట్లు తెలిపారు.నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ బాలక్రిష్ణ, పోలీస్ కానిస్టేబుల్ విజయ్, మలంగ్‌షా, హోంగార్డు శివ, సిబ్బందిని రాయచోటి డిఎస్‌పి రామచంద్రరావు అభినందించారు.